# ఇలా వచ్చారు.. అలా వెళ్లారు..

- పావుగంట కోసం ఇంత పరుగులా ?
- మేడిగడ్డ ప్రాజెక్టు చూసేందుకు కాంగ్రెస్ హైడ్రామా
- ప్రాజెక్టులోకి వెళ్లేందుకు విశ్వ ప్రయత్నం
- రాహుల్‌గాంధీ పర్యటనపై జనం పెదవి విరుపు



మహదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లి వద్ద కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సదస్సులో ఖాళీగా ఉన్న కుర్చీలు

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : షెడ్యూల్ లేని రాహుల్ పర్యటన ఇప్పటికే జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో పూర్తయింది. హఠాత్తుగా రాత్రికి రాత్రే మేడిగడ్డ పర్యటన ఖరారు చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టును చూసేందుకు అంబట్‌పల్లిలో మహిళా సదస్సు పేరిట కొత్త నాటకమాడారు. ఈ సాకుతో పార్టీ నాయకులను, కార్యకర్తలను అంబట్‌పల్లికి చేర్చారు. మహిళా సదస్సుకు వచ్చిన మహిళలు తక్కువే. నాయకులు, కార్యకర్తలను అక్కడికి చేర్చారు. ఉదయం 8:15 గంటలకు మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద హెలికాప్టర్‌లో చేరుకున్న రాహుల్‌గాంధీ నేరుగా అక్కడి నుంచి కారులో అంబట్‌పల్లి సదస్సుకు చేరుకున్నారు. 15 నిమిషాల్లో ప్రసంగాన్ని ముగించి మళ్లీ ప్రాజెక్టు వద్దకు వెళ్లి రేవంత్‌రెడ్డితో కలిసి ప్రాజెక్టును పరిశీలించి వెళ్లి పోయారు. రాహుల్ ప్రసంగంలో రొటీన్ డైలాగ్‌లు తప్ప కొత్తేమీ లేదు. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా మారింది పర్యటన. దీంతో సభకు వచ్చిన కొద్దిపాటి జనం అసంతృప్తితో వెనుదిరిగారు. సదస్సులో ప్లకార్డులు సరిగా పట్టుకోవడం రాని మహిళలను చూస్తే వారిని ఎందుకు తీసుకువచ్చారో అర్థమవుతుంది. సదస్సు పావుగంటలో పూర్తి కావడంతో అసలు తమను ఎందుకు పిలిచారు.. ఈ మీటింగ్ ఎందుకు పెట్టారు.. అని మహిళలు మండిపడుతూ వెళ్లడం కనిపించింది. బరాజ్ వద్ద ఉన్న సెక్యూరిటీని తోసుకుంటూ కాంగ్రెస్ కార్యకర్తలు లోనికి వెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ప్రాజెక్టును పరిశీలించకుండానే సభకు వచ్చి వెళ్లేటప్పుడు చూసి వెళ్లడం ఏంటని పలువురు పార్టీ కార్యకర్తలు మాట్లాడుకోవడం కనిపించింది. మొత్తం మీద ప్రాజెక్టు సందర్శన కోసం సదస్సు పేరిట ఇంత హైడ్రామా ఆడడం తెలుసుకున్న జనం ఛీదరించుకుంటున్నారు. ప్రాజెక్టు పరిశీలనకు అధికారులు రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డిని అనుమతించారు.



కలశాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

## అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

తొర్రూరు, నవంబర్ 2 : డివిజన్ కేంద్రంలోని మహబూబాబాద్ రహదారిలో కేవీబీనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ అర్చకులు రాజేశ్ నంబూద్రి, ఆలయ పూజారులు మధుశర్మ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాద అందించారు. కార్యక్రమంలో దారం ప్రసాద్ దంపతులు, చిత్తలూరి సతీశ్, బిజ్జాల వెంకటరమణ, వల్లపు మధు, కాంతాల సోమిరెడ్డి, ఇమ్మడి రాంబాబు, రేగురు శ్రీనివాస, బిజ్జాల శ్రీనివాస్, చీదర వీరన్న, వనమాల సురేశ్, కృపాకర్‌రాజు భక్తులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న శంకర్ గౌడ్

## గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా శంకర్

వెంకటాపూర్, నవంబర్ 2 : తెలంగాణ గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా గట్టు శంకర్‌గౌడ్‌ను నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ముస్నిపెల్లి మొండయ్య గౌడ్ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీదేవిపేట సర్పంచ్ గట్టు కుమారస్వామి, గట్టు చిన్న రాజయ్య, చిర్ర తుపాన్, చిర్ర శివకృష్ణ, వీరగాని రమేశ్, దొమ్మటి రాజయ్య, కాసగాని ఓదెలు, కారుపోతుల రాజు, గట్టు సాంబయ్య, జనగాం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## 6న మండల సర్వసభ్య సమావేశం

గంగారం, నవంబర్ 2 : ఈ నెల 6న (సోమవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అపర్ణ తెలిపారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు, ఆరు కాపీలను సమావేశం ముందు రోజు కార్యాలయంలో సమర్పించాలన్నారు. అధికారులు ప్రగతి నివేదికలతో సమావేశం హాజరుకావాలని, అలాగే మండల ప్రజాప్రతినిధులంతా సకాలంలో సమావేశానికి రావాలని కోరారు.

## ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య



కొమురయ్య (ఫైల్)

వెంకటాపూర్, నవంబర్ 2 : మండలంలోని నర్సాపూర్‌కు చెందిన గుండెల్లి కొమురయ్య(50) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. ఎస్సై చల్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ గ్రామానికి చెందిన కొమురయ్య బుధవారం సాయంత్రం పొలాల మధ్య ఉన్న మర్రి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొమురయ్య 13 ఎకరాల వరి చీడ పురుగులతో పంట దెబ్బ తిందని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తన కుమారుడు నరేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య సరోజన, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

గంగారం, నవంబర్ 2 : ఉమ్మడి వరంగల్ ఖో–ఖో అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1న జేఎన్‌ఎస్‌లో ఉమ్మడి వరంగల్ సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మండల పరిధిలోని మడగూడెం ప్రభుత్వ గిరిజన గురుకులానికి చెందిన యమన్ మార్తిక్ కుమార్ ఖో–ఖో రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. ఈ నెల 17,18,19న కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో జరిగే క్రీడలకు హాజరు కానున్నట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కొమ్ములు తెలిపారు. విద్యార్థిని గురువారం ఉపాధ్యాయులు, సర్పంచ్ వెంకటలక్ష్మి అభినందించారు.

## అటవీ ఉత్పత్తుల సేకరణపై అవగాహన

ఏటూరునాగారం, నవంబర్ 2 : అటవీ ఉత్పత్తుల సేకరణతో ఆదాయం పొందాలని స్థానిక జీసీసీ బ్రాంచ్ మేనేజర్ దేవ్ సూచించారు. బ్రాంచి పరిధిలోని ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో గురువారం గిరిజన గ్రామాల్లో పర్యటించి అటవీ ఉత్పత్తుల ధరల పట్టికతో ప్రచారం చేశారు. ఉత్పత్తుల సేకరణతో వచ్చే ఆదాయాన్ని వివరించారు. ముష్టి గింజల సేకరణను పరిశీలించారు. సేకరణ కోసం ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు దేవ్ తెలిపారు. ఈ ఏడాది ఎక్కువ గింజలు సేకరించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.



వాల్ పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న బ్రాంచ్ మేనేజర్ దేవ్



నేరేడుపల్లిలో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే గండ్ర పరామర్శ

కృష్ణకాలనీ, నవంబర్ 2 : భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు ఇండ్ల రాధమ్మ భర్త, మాజీ సర్పంచ్ ఇండ్ల రాయమల్లు అనారోగ్యంతో మృతి గురువారం చెందాడు. రాయమల్లు మృతదేహానికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నేరేడు పల్లి గ్రామ సర్పంచ్ దానవేని రమాదేవి, మాజీ ఎంపీపీ కళ్లెపు రఘుపతిరావు, బీఆర్‌ఎస్ నాయకులు మందల విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గణపురంలో..

గణపురం : మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన కర్రుర్రి చిరంజీవి అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్‌రెడ్డి చిరంజీవి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు అంబటిపల్లి సంపత్ రావు, నాయకులు అమరాజు, తిరుపతి, పవన్, భాస్కర్, రంజిత్, హఫీజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ కిట్లను అందిస్తున్న డాక్టర్ అభినవ్

## కేసీఆర్ కిట్ల పంపిణీ

కన్నాయిగూడెం, నవంబర్ 2 : మండలంలోని పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులకు గురువారం డాక్టర్ కేసీఆర్ కిట్లను అందజేశారు. న్యూట్రిషన్ కిట్ల ఉపయోగాన్ని డాక్టర్ గర్భిణులకు వివంచారు. వాటిని ఉపయోగించిన తర్వాత శిశు మరణాల సంఖ్య పూర్తిగా తగ్గిపోయినట్లు తెలిపారు. ప్రతి నెల దవాఖానకు వచ్చి ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాలని సూచించారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

- రూ.90వేల విలువైన ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ రంజిత్‌రావు

కాటారం, నవంబర్ 2 : కొద్ది రోజులుగా మండలంలో వరుసగా దొంగతనాలకు పాల్పడిన నిందితుడు ఎట్టకేలకు కాటారం పోలీసులకు చిక్కాడు. అతడు మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణానికి చెందిన చింతకింది సతీష్‌గా గుర్తించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ రంజిత్‌రావు వివరాలను వెల్లడించారు. గత నెల 22న మండల కేంద్రంలోని ఆదర్శ నగర్‌లో నివాసం ఉంటున్న వేణుగోపాల్, ముస్కుల సురేందర్ రెడ్డిఇండ్లలో చొరబడి దొంగతనం చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీలు, వేలిముద్రల సాయంతో ప్రత్యేక బృందంను రంగంలోకి దింపి దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. గురువారం నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా అంగీకరించినట్లు తెలిపారు. అతడి నుంచి రూ.90వేల విలువైన ఆభరణాలు, మొబైల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లినప్పుడు విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకూడదని, పోలీసులకు సమాచారం ఇస్తే రాత్రి ఆ ఏరియాలో గస్తీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే స్థానికులు కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్సై అభినవ్, సురేశ్, సిబ్బంది తిరుపతి, లక్ష్మీరాజ్, లవణ్, వేణు, ప్రసాద్ పాల్గొన్నారు.



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రంజిత్‌రావు



పెద్దవంగర సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్

## కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

### సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్

పెద్దవంగర, నవంబర్ 2 : కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లకు సామాజిక భద్రత చట్టాలను అమలు చేయాలని, అసంఘటిత కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ కోరారు. గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పసుల స్వరూప అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దుండి వీరన్న, సీఐటీయూ సీనియర్ నాయకులు బొల్లం అశోక్, ఎండీ యాకూబ్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జమ్ముల శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రాపోలు వీరన్న, సీఐటీయూ నాయకులు కే కుమారస్వామి, తిమ్మిడి రవి, గుంటుక కుమార్, పిట్టల రాములు, ఝాన్సీ, మంజుల, రేణుక, సరళ తదితరులు పాల్గొన్నారు.